క్లుప్తంగా

అర్జీల విచారణ వేగవంతం చేయండి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్దేశిత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. బుధవారం గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో మాట్లాడారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్, అర్జీలపై చర్చించారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు.. గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లే అవుట్లు వేయకుండా కట్టడి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ డి.అర్జున్, వీఆర్వోలున్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

చీరాల టౌన్: సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రత్యేక పారిశుధ్య పనులు చేస్తున్నామని.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపురుపాలెం పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ సూచించారు. బుధవారం గాంధీ పార్కు సెంటర్, సావరపాలెం, 40 ఇండ్ల కాలనీ, పద్మనాభునిపేట, సీతారాంపేట, ఇందిరానగర్ కాలనీ ప్రాంతాల్లో చెత్తకుప్పలు, చిల్ల చెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. తడి చెత్త, పొడిచెత్తను వేర్వేరుగా నిల్వచేసి చెత్త బుట్టలకు అందించాలన్నారు. పంచాయతీ సిబ్బంది, కార్మికులున్నారు.

11 మంది జూదరుల అరెస్ట్


నిందితులతో ఎస్సై, సిబ్బంది

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకొన్నట్లు ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. వీరి వద్ద నుంచి 7,500 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలియజేశారు. జూదం నిర్వహించినా, ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అవగాహనతో హెచ్‌ఐవీ దూరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

అద్దంకి: యువతకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరమని కట్టారామకోటేశ్వరరావు డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు అన్నారు. స్థానిక కళాశాలలో బుధవారం నిర్వహించిన ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఎయిడ్స్ నియంత్రణ కోసం వివిధ నూతన ఆవిష్కరణల గురించి యువత తెలుసుకోవాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు జాతీయ రహదారి వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

చీరాల రూరల్: తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ప్రొఫెసర్ చెంగయ్యపై దాడికి పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలంటూ బహుజన్ సమాజ్ పార్టీ, క్రిస్టియన్ కోఆర్డినేషన్ కౌన్సిల్ నాయకులు పేర్కొన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గడియార స్తంభం సెంటర్లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి డొక్కా జగన్‌మోహన్‌రావు, కాటి మార్క్, కాగిత కోటేశ్వరరావు, దుడ్డు భాస్కరరావు, గొర్రెపాటి రవికుమార్, చిట్టిమాల సంగీతరావు, కుంచాల పుల్లయ్య, రాజారావు, అర్జునరావు, శివప్రసాద్, నాతాను, పాలు, డేవిడ్, షేక్ జిలాని పాల్గొన్నారు.

చీరాల: తిరుపతి ఎస్వీ యూనివర్శిటీలో దళిత ప్రొఫెసర్ చెంగయ్యపై భజరంగ్ దళ్, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు జరిపిన దాడిని నిరసిస్తూ బుధవారం బీఎస్పీ, సీసీసీ ఆధ్వర్యంలో స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో నిరసన తెలిపారు. డాక్టర్ డి.జగన్‌మోహన్‌రావు, కాటి మార్క్, డి.భాస్కరరావు, జి.రవికుమార్, పాస్టర్ నాతాను, సంగీతరావు, రమణ పాల్గొన్నారు.


ఈర్లకొండ నుంచి బ్రిడ్జి మీదుగా వెళుతున్న భారీ గ్రానైట్ లారీలు


ముక్తేశ్వరం- రామాంజనేయ పురం మధ్య ప్రమాదభరితంగా వంతెన


అంబడిపూడి- కొమ్మినేనివారి పాలెం మధ్య మలుపులు

వంతెనలు..చింతలు

- శిథిలావస్థలో వంతెనలు
- అద్దంకి బ్రాంచ్ కెనాల్ బ్రిడ్జి వద్ద గత పది సంవత్సరాల్లో 24 మంది మృతి
- మలుపుల వద్ద పొంచి ఉన్న ప్రమాదాలు
- క్షతగాత్రులుగా మారిన 60 మంది

బల్లికురవ:

బ్రిటిష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరి ఏ సమయంలో కూలుతాయో అని అర్థం కావడంలేదు. ఈ పరిస్థితులకు తోడు బ్రిడ్జికి ఇరువైపులా ఏర్పాటు చేసిన సైడ్ యాంగిలర్స్ పూర్తిగా వంగిపోవటంతో కింద పడిపోతున్నారు. అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో.. వల్లాపల్లి-ధర్మవరం గ్రామాల మధ్య ఆరు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన సింగిల్ బ్రిడ్జి కూలేందుకు సిద్ధంగా ఉంది. అప్పట్లో నాగార్జున సాగర్ అద్దంకి బ్రాంచ్ కాలువ దాటేందుకు దీనిని నిర్మించారు. 10 గ్రామాల రైతులు.. పశువులు.. పంట ఉత్పత్తులను తరలించేందుకు అనుకూలంగా నిర్మించగా నేడు దుస్థితికి చేరింది.

డబుల్ రోడ్డు నిర్మించారుకానీ వంతెన?

ఈ రోడ్డును ఆరు సంవత్సరాల క్రితం రూ. 36 కోట్లతో డబుల్ రోడ్డుగా విస్తరించారు కానీ.. ఈ బ్రిడ్జిని నూతనగా నిర్మించలేదు. కనీసం వెడల్పు కూడా పెంచలేదు. ఈ రహదారిలో బల్లికురవ సమీపంలోని ఈర్లకొండ నుంచి నిత్యం 70 నుంచి 80 టన్నుల భారీ గ్రానైట్ లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. బల్లికురవ, అద్దంకి, మార్టూరు, సంతమాగులూరు మండలాల నుంచి 50 గ్రామాల ప్రజలు నిత్యం నియోజకవర్గ కేంద్రమైన అద్దంకి పట్టణానికి ఈ బ్రిడ్జి మీదుగానే వెళ్లాలి. కానీ ఇది శిథిలమవడంతో ఎప్పుడు కూలుతుందో అంతా భయాందోళన చెందుతున్నారు. ఇక్కడే మలుపులతో పాటు బ్రిడ్జికి ఇరువైపులా యాంగిలర్లు వంగిపోవడం ప్రమాదకరంగా మారింది. గత పది సంవత్సరాల్లో 24 మంది వరకు ఈ బ్రిడ్జి వద్ద ప్రమాదాల బారిన పడి చనిపోయారు. సుమారు 60 మంది వరకు గాయాల పాలయ్యారు. నూతన బ్రిడ్జి నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పంపగా కార్యరూపం దాల్చలేదు.


అద్దంకి బ్రాంచ్ కాలువదాటే చోట ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి


అద్దంకి బ్రాంచ్ కాలువ వద్ద కాలువలో పడిన కారు (ఫైల్)

మలుపులతో గుండె దడ

అంబడిపూడి-వైదనలింక్ రోడ్డు వద్ద తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అంబడిపూడి-కొమ్మినేని వారి పాలెం గ్రామాల మధ్య అద్దంకి బ్రాంచి కాలువను దాటే కూడా బ్రిడ్జి కూడా జీర్ణావస్థకు చేరింది.

లింక్ రోడ్లలోనూ అవస్థలే

మేదరమెట్ల-నార్కెట్ పల్లి నామ్ రహదారిలోని మండలంలోని రామాంజనేయ పురం నుంచి ముక్తేశ్వరం, గుంటుపల్లి, అంబడిపూడి మీదుగా ఇసుక దర్శి, చెన్నై-విజయవాడ జాతీయ రహదారిని కలిపే లింకు రోడ్డులో వంతెనలు అధ్వాన స్థితిలో ఉన్నాయి. దీంతో 40 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రామాంజనేయ పురం-ముక్తేశ్వరం గ్రామాల మధ్య చెన్నుపల్లి మేజర్ కాలవను దాటే చోట వంతెనకు ఇరువైపులా ఉన్న గోడలు పడిపోయాయి. ఇక్కడ ప్రమాదం పొంచి ఉంది. బైకులు, ఆటోలు మినహా ఇతర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు.

ప్రమాదాలు నివారించండి



అద్దంకి బ్రాంచి కాలువను దాటే చోట తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు అయ్యో పాపం అంటున్న అధికారులు తర్వాత ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. వంతెన నిర్మించి కష్టాలు తీర్చాలి.

– మేదగం శ్రీనివాసరెడ్డి, వల్లాపల్లి

లింకు రోడ్లను అభివద్ధి చేయండి



లింకు రోడ్లు, వంతెనలు అధ్వాన స్థితిలో ఉండటంతో ప్రయాణం సాగటం లేదు. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలి.

– బొట్లగుంట హరికృష్ణ, అంబడిపూడి

ఆధునిక పరిజ్ఞానంతోనే ఉపాధి


క్లాసులు ప్రారంభిస్తున్న కళాశాల అధ్యక్షుడు బండ్ల అంకయ్య

వేటపాలెం: ఆధునిక కంప్యూటర్ పరిజ్ఞానంతో కార్పొరేట్ ఉద్యోగ అవకాశాల అందుకోవచ్చని బీబీహెచ్ కళాశాల అధ్యక్షుడు బండ్ల అంకయ్య పేర్కొన్నారు. స్థానిక బీబీహెచ్ హిందూ కళాశాలలో చెన్నైకి చెందిన కోకో ట్రెనింగ్ ప్లేస్‌మెంట్ కన్సల్టెన్స్, బీబీహెచ్ కళాశాల సెంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు కంప్యూటర్ శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. వర్తమాన ప్రపంచంలో ఆకౌంట్‌కు సంబంధించిన సాఫ్ట్‌వేర్ కోర్సులతో పాటు కామర్స్‌కు సంబంధించిన కోర్సులు ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. ఇంటర్ నుంచి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరికీ అవి వసరమన్నారు. ఇక్కడ జీఎస్‌టీ, ఇన్‌కం టాక్స్, టాలీ, టీడీఎస్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ కోడూరి ఏకాంబేశ్వరబాబు, సెక్రటరీ కరస్పాండెంట్ చల్లా వాసుదేవరావు, జాయింట్ సెక్రటరీ బండ్ల రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, ఎం. గంగాధరరావు పాల్గొన్నారు.

రుణాలు చెల్లించకుంటే చర్యలు

జె.పంగులూరు: స్త్రీనిధి రుణాలు తీసుకుని, సకాలంలో చెల్లించని వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని స్త్రీనిధి మేనేజర్ టి. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పంగులూరులోని వెలుగు కార్యాలయంలో జరిగిన వీవోఏలతో మాట్లాడారు. స్త్రీనిధి రుణాలు విరివిగా తీసుకోవాలని అయితే సకాలంలో రుణాలు చెల్లించాలని ఆయన కోరారు. స్త్రీ నిధి రుణాల ద్వారా మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని, కుటుంబాలను అభివృద్ధి పథంలో నడుపుకునేందుకు ఈ రుణాలు ఎంతో ఉపయోగపడగలవన్నారు. డీఎంజీ భాస్కర్ మాట్లాడుతూ మొబైల్ బుక్ కీపింగ్, గ్రేడింగ్ లోకోస్ ఏల గురించి తెలియజేశారు. సీసీలు సాల్మన్, సురేష్ చంద్ర, అకౌంటెంట్ భాస్కరమ్మ, వీవోఏలు పాల్గొన్నారు. మండల వీవోఏల నూతన కార్యవర్గాన్ని బుధవారం వెలుగు కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కొణిజేటి రోశయ్యకు ఘన నివాళి


కొణిజేటి రోశయ్యకు నివాళులర్పిస్తున్న కరణం వెంకటేష్

చీరాల: తమిళనాడు మాజీ గవర్నర్, ఉమ్మడి తెలుగు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం చీరాలలో నిర్వహించారు. స్థానిక మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్ వద్ద గల కొణిజేటి రోశయ్య విగ్రహానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, ఎంజీసీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు వేముల చంద్రశేఖర్, కార్యదర్శి తాతా కుమారస్వామి, టీటీఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు శీరాం వేణుగోపాల్, కోట శ్రీమన్నారాయణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని లీలాధరరావు, తులాబందుల సురేష్‌కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్యకు చీరాల నియోజకవర్గానికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఎమ్మెల్యేగా, ఆర్థిక మంత్రిగా పని చేశారన్నారు. చీరాల నియోజకవర్గ ప్రజలకు ఆయన విడదీయరాని బంధం ఉందని తెలిపారు. ఆయన చీరాల నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని తెలిపారు. ఆయన భౌతికంగా లేకపోయినా ఆయన చేసిన అభివృద్ధి కనిపిస్తూనే ఉంటుందన్నారు. గవిని శ్రీనివాసరావు, గుర్రం రాఘవరావు, మంచికంటి వెంకటేశ్వర్లు, వస్త్ర వ్యాపారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయండి


పర్చూరులో మాట్లాడుతున్న క్వాలిటీ కంట్రోల్ అధికారి శాంతారావు

పర్చూరు (చినగంజాం): పర్చూరు, చీరాల నియోజక వర్గాల పరిధిలో మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని బాపట్ల జిల్లా సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి పి. శాంతారావు సూచించారు. బుధవారం పర్చూరులోని ఏపీఓ కార్యాలయ సమావేశ మందిరంలో చీరాల, వేటపాలెం, చినగంజాం, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు మండలాల పరిధిలోని ఉపాధి హామీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏపీఓ బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలు శుభ్రం చేసిన విద్యార్థులు


పెదగంజాంలో శుభ్రం చేస్తున్న పూర్వవిద్యార్థులు, రామదండు సేవాదళ సభ్యులు

చినగంజాం: పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాల ఆవరణలోని పరిసరాలను శుభ్రం చేశారు. వీరితో పాటు గ్రామానికి చెందిన రామదండు సేవాదళ సభ్యులు కలిసి పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంలో పిచ్చి మొక్కలను, చిల్లచెట్లను ముళ్లపొదలను తొలగించి సాయం చేశారు. పాఠశాల పీడీ ఎం. అనిల్ కుమార్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఆసోది సుదర్శనరెడ్డి కూడా సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

నిండా ముంచిన వాన


వర్షపు నీటితో పూర్తిగా మునిగిన నాట్లు

అద్దంకి: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావంతో మండలంలోని తిమ్మాయపాలెంలోని పొలాల్లో వేసిన వరి నాట్లు నిండా మునిగాయి. గత రెండు రోజులుగా వర్షాలు పడుతున్నా మంగళవారం ఉదయం అరగంట పాటు పడిన భారీ వర్షం గ్రామంలోని అద్దంకి-దర్శి రహదారికి ఇరువైపులా ఉన్న మాగాణి పొలాల్లోని లేత నాట్లను నిండా ముంచింది. వర్షపు నీరుతో మాగాణి పొలాలు పూర్తిగా జలమయం అయ్యాయి. దాంతో 50 ఎకరాల విస్తీర్ణంలోని వరి నాట్లుపై ఆశలు వదులు కోవాల్సి వస్తోంది. ఎకరా నారుతో సహా రూ. 20 వేల వరకు పెట్టుబడి పెట్టామని, మొత్తం వర్షార్పణం అయిందని రైతులు వాపోతున్నారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

చీరాల రూరల్: జాతీయ స్థాయిలో జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన వై. యశ్వంత్‌రాజ్, పి. మహాలక్ష్మికి ఎస్‌ఆర్‌అండ్‌పీఎం హైస్కూలు చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోచ్ పులుగు ధనుంజయ శ్రీనివాసరెడ్డి సమక్షంలో బుధవారం ఆర్థిక సాయం అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పోలుదాసు రామకృష్ణ మాట్లాడుతూ.. ఈనెల 7 నుంచి 11 భువనేశ్వర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద నున్న ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యు.దేవపాలన, జ్యోతి చంద్రమౌళి, జ్యోతి రమేష్‌బాబు, చప్పిడి వీరయ్య, మలాది శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకరరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

వేటపాలెం: వేగంగా వస్తున్న మోటర్ బైక్ డివైడర్‌ని ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న వ్యక్తి రోడ్డు పై పడి తలపగిలి తీవ్రగాయాల పాలయ్యాడు. 216 జాతీయ రహదారి పందిళ్లపల్లి జక్షన్ వద్ద బుధవారం రాత్రి సంఘటన చోటు చేసుకుంది. సమచారం మేరకు కారంచేడుకు చెందిన అనిల్ చౌదరి ఒంగోలు సొంత పనిమీద వెళ్లాడు. తిరిగి కారంచేడు కు బైక్ పై వస్తున్న సమయంలో పందిళ్లపల్లి బైపాస్ రోడ్డులో వేగంగా రోడ్డు మధ్యలోని డివైడర్ ఢీ కొట్టాడు. బైక్ పై నుంచి ఎగిరి రోడ్డు పై పడ్డాడు. చీరాల ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

జాబ్ మేళాలో 30 మంది ఎంపిక

చీరాల అర్బన్: జవహర్ విజ్ఞాన కేంద్రం, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 84 మంది హాజరు కాగా 30 మంది ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మురళి తెలిపారు. కళాశాల మెంటార్ ఎస్వీ సుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.

పంగులూరులో నైట్ బ్లడ్ సర్వే

జె.పంగులూరు: పంగులూరులో నైట్ బ్లడ్ సర్వే నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ హరిబాబు బుధవారం తెలిపారు. బోదకాలు సంబంధిత వ్యాధులకు చెందిన సర్వేను రాత్రి సమయాల్లో చేయాలని జిల్లా వైద్యాధికారి సూచన మేరకు చేస్తున్నామని తెలిపారు.

నాటుసారా స్వాధీనం

చీరాల: ఎక్సైజ్ పోలీసులు మూడు లీటర్ల నాటుసారాను బుధవారం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు చీరాల సీఐ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్సై బి.శ్రీహరి, సిబ్బంది బుధవారం ఈపూరుపాలెం గ్రామంలోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. దీంతో ఈపురుపాలేనికి చెందిన కె.రమేష్ అనే వ్యక్తి వద్ద నుంచి మూడు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు.


అద్దంకి: పొలాన్ని పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి దీప్తి


పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు


బొల్లాపల్లిలో మాట్లాడుతున్న ఏవో కిరణ్ కుమార్

పంటల వివరాలు నమోదు చేసుకోండి

మార్టూరు: ప్రస్తుతం రబీ సీజన్లో సాగు చేస్తున్న పంటల వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి. కిరణ్ కుమార్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో రైతులతో నిర్వహించిన కార్యక్రమంలో బుధవారం మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది చైతన్య గ్రామ రైతులు పాల్గొన్నారు.

అద్దంకి: ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఉద్యాన శాఖ అధికారి ఎస్. దీప్తి అన్నారు. బుధవారం మండలంలోని నాగులపాడు.. వేలమూరిపాడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు.

ఏఓ కొర్రపాటి వెంకటకష్ణ మాట్లాడుతూ వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వ్యవసాయ సహాయకులు అనూష, తదితరులు పాల్గొన్నారు.

శనగ పంటలో తెగుళ్లు ప్రమాదకరం

పర్చూరు (చినగంజాం): రైతులు శనగపంటలో వచ్చు తెగుళ్ళను సమర్థవంతంగా అరికట్టేందుకు కృషి చేయాలని పర్చూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్. మోహనరావు అన్నారు. మండలంలోని అన్నంబొట్లవారిపాలెం, తన్నీరువారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయాధికారి రామ్మోహనరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఇ-పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. సర్పంచ్ నాగేశ్వరావు, ఆళ్ళ వెంకటరావు, ఆదర్శ రైతులు, వీఏఏలు హేమవర్ధని, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్ఏలు పాల్గొన్నారు.


చీరాల: రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సుమతి


జె.పంగులూరు: శనగ పంట పరిశీలిస్తున్న అధికారులు

బల్లికురవ: మొక్కజొన్న వరిపంటలకు చీడపీడలు ఆశించాయని రైతులు నివారించుకోవాలని మార్టూరు వ్యవసాయశాఖ ఏడీఏ కేవీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం వెలమవారిపాలెం, కొత్తూరు గ్రామాల్లో మొక్కజొన్న వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

జె.పంగులూరు: మండల పరిధిలోని ఆరికట్లవారి పాలెం, ముప్పవరంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయ శాఖ అధికారి డి. సుబ్బారెడ్డి పలు సూచనలు చేశారు. నాయకులు మాగులూరు వీరాంజనేయులు, బాలకృష్ణ, వ్యవసాయ శాఖ సహాయకులు అలెగ్జాండర్, దిల్జా పాల్గొన్నారు.

చీరాల రూరల్: రబీ సీజన్లో రైతులు పండించే అన్ని రకాల పంటలను రైతు సేవా కేంద్రాల ద్వారా ఇ-పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుమతి పేర్కొన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని బుర్లవారిపాలెం, పిట్టువారిపాలెం, విజయలక్ష్మిపురంలో నిర్వహించారు. వీఏఏలు హదస్సా, శ్రావ్య, జెడ్పీఎస్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ వెల్నెస్ సెంటర్ మార్చవద్దు

జె.పంగులూరు: మండలంలోని కొండమంజులూరు గ్రామంలో నిర్మించిన ఆయుష్మాన్ భారత్ హెల్త్ సెంటర్ నుంచి సామగ్రిని మార్చవద్దని, అన్ని సౌకర్యాలతో ఉన్న హెల్త్ వెల్నెస్ సెంటర్లోనే ఆరోగ్య కేంద్రాన్ని కొనసాగించాలని కొండమంజులూరు గ్రామస్తులు కోరారు. ఈ మేరకు డీఎంఅండ్‌హెచ్‌వోకు, పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యునికి బుధవారం వినతి పత్రం పంపారు.